

సహజ హోలీ.. సంతోషాల కేళి
మోదుగు పూలతో తయారు చేసిన రంగులతో హోలీ ఆడటం ఆనవాయితీ. వేడుకల్లో సహజ సిద్ధమైన కలర్లు వినియోగించడమే శ్రేయస్కర మని వైద్యనిపుణులు చెబుతున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:21	శుక్ర: 5:09

గరిష్టం/కనిష్టం
39.0 /24.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం వైవిధ్యంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

దివ్యాంగులకు ఉపకరణాలు



ఉపకరణాలు ఇస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సమగ్ర శిక్షా అభియాన్, అలింకో సంస్థ సహకారంతో జిల్లాలోని 91 మంది దివ్యాంగులకు బుధవారం రూ.7.70లక్షల విలువైన 133 ఉపకరణాలు, ఇతర పరికరాలను కలెక్టర్ అభిలాష అభినవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఉపకరణాలు అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తెలిపారు. భవిత సెంటర్ ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం పలువురు దివ్యాంగులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. డీఈవో రామారావు, ఎంఈవో నాగేశ్వర్‌రావు, అధికారులు లింబాద్రి, ప్రవీణ్, దివ్యాంగులు, పోషకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కొరత రానివ్వొద్దు



నీటి వనరును పరిశీలిస్తున్న శర్వానంద్

మామడ: అటవీ ప్రాంతంలో జంతువులకు నీటి వనరుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని బాసర సర్కిల్ సీసీఎఫ్ శర్వానంద్ సూచించారు. బుధవారం మామడ అటవీ క్షేత్ర పరిధిలోని భీమన్న గుట్ట, ఆరేపల్లి అటవీ ప్రాంతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటికుంటల నిర్మాణం, సాసర్‌పిట్‌లు, నీటిచెల్మలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నీటి కుంటల సమీపంలో కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నీటి వనరుల వద్దకు వచ్చే నీలుగాయి, సాంబర్, జింక తదితర అటవీ జంతువులు, పక్షులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎఫ్‌వో నాగినిభాను, ఎఫ్ఆర్వో రాథోడ్ అవినాశ్, ఎఫ్ఎస్వో ప్రభాకర్, ఎఫ్‌బీవోలు రమేశ్, మౌనిక ఉన్నారు.

నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి మేస్త్రిర సాయికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బడ్జెట్‌లో 7శాతం నిధులే కేటాయించి ఆ మొత్తాన్ని కూడా పూర్తిగా విడుదల చేయకపోవడంతో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రాక పేద విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తేనే విద్యావ్యవస్థ గాడిలో పడుతుందని తెలిపారు. నాయకులు తేజ, శేఖర్, సాయిప్రసాద్, అజయ్, గణేశ్, సందీప్ పాల్గొన్నారు.

పశుసంపదను పరిరక్షించాలి



టీటీడీ చైర్మన్ నాయుడుతో దివ్యారెడ్డి

నిర్మల్ టౌన్: దేశీయ పశుసంపదను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలని క్లీమామ్ గోశాల వ్యవస్థాపకురాలు, సేవ్ దేశీ కౌస్ క్యాంపెయినర్ అల్లోల దివ్యారెడ్డి కోరారు. బుధవారం తిరుపతిలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిశారు. క్రాస్ బ్రీడింగ్‌తో దేశంలో అంతరించిపోయే దశకు చేరిన దేశవాళీ ఆవుల సంరక్షణకు చేస్తున్న క్యాంపెయినింగ్‌కు మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. దేశవాళీ ఆవుల సంరక్షణకు చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా దేశవాళీ ఆవుల సంరక్షణకు చేస్తున్న మంచి కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందని బీఆర్ నాయుడు పేర్కొన్నట్లు అల్లోల దివ్యారెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిర్మల్ రూరల్: జిల్లాలో బుధవారం నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 205 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో పరశురాం తెలిపారు. మొత్తం 6,166 మంది విద్యార్థులకు గాను 5,961 మంది హాజరు కాగా 205 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఒకేషనల్ కేటగిరీలో 619 మందికి 589 మంది హాజరు కాగా, 30 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జనరల్ కేటగిరీలో 5,547 మందికి 5,372 మంది విద్యార్థులు హాజరు కాగా, 175 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పసుపు రైతు పరేషాన్!



లక్ష్మణచాందలో సాగు చేసిన పసుపు పంట

- పసిడి పంటకు దక్కని 'మద్దతు'
- బోర్డు వచ్చినా అందని ఫలితం
- పెట్టుబడి ఖర్చులూ రాని వైనం
- భారీగా నష్టపోతున్న రైతాంగం

జిల్లాలో సాగు వివరాలు

గతేడాది సాగు :	15వేల ఎకరాలు
ఈ ఏడాది.. :	5,500 ఎకరాలు
ఎకరాకు పెట్టుబడి :	రూ.లక్ష-రూ.లక్షన్నర
గతేడాది ధర :	రూ.16వేలు-రూ.17వేలు
ప్రస్తుత ధర :	రూ.7వేలు-రూ.10వేలు

లక్ష్మణచాంద: ఆరుగాలం కష్టపడి పసుపు సాగు చేసిన జిల్లా రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఎన్నో ఆశలతో సాగు చేసిన అన్నదాతలకు దిగుబడి బాగా తగ్గింది. వచ్చిన కాస్త పంట అమ్ముకుందామనుకుంటే ప్రస్తుతం మార్కెట్‌లో ధర లేదు. పొరుగు జిల్లా నిజామాబాద్‌లో ఇటీవల పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాకు చెందిన పసుపు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. బోర్డు ఏర్పాటుతో పసుపు పంటకు గిట్టుబాటు ధర వస్తుందని భావించారు. కానీ.. పసుపు బోర్డు ఏర్పాటైనా అక్కడ కూడా పంటకు సరైన ధర లేక ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో సాగు ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఈసారి సుమారు 5,500 ఎకరాల్లో పసుపు సాగు చేసినట్లు జిల్లా ఉద్యానవన అధికారి బీవీ రమణ తెలిపారు. గతేడాది 15వేల ఎకరాల్లో సాగు కాగా.. ఈసారి సాగు విస్తీర్ణం ఘననీయంగా తగ్గినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది సాగు ప్రారంభ దశలో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో పంటపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. కానీ.. తరువాత క్రమంలో పంటకు వివిధ తెగుళ్లు సోకాయి. ప్రధానంగా దుంప కుళ్లు, మర్రి ఆకు తెగుళ్లు సోకగా పంట దెబ్బతిని దిగుబడి ఘననీయంగా తగ్గింది. ఎకరాకు కనీసం 15 క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పెరిగిన పెట్టుబడి ఖర్చులు

దీర్ఘకాలిక (9 నెలలు) పంట అయిన పసుపు సాగుకు పెట్టుబడి కూడా ఎక్కువేనని రైతులు చెబుతున్నారు. ఎకరం సాగుకు కనీసం రెండు లారీల పశువుల ఎరువు అవసరముంటుందని తెలిపారు. ఇందుకు రూ.60వేలు, కలుపు తీతకు కూలీలు, రసాయన ఎరువులకు కలిపి రూ.25 వేలు, పసుపు తవ్వకం, ఉడకబెట్టడం కోసం మరో రూ.30 వేలు.. ఇలా మొత్తంగా ఎకరా సాగుకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు ఖర్చయినట్లు రైతులు చెబుతున్నారు. గతేడాది పలికిన ధరే ఈసారి ఉంటుందని భావించిన రైతులకు నిరాశే మిగిలింది.

పడిపోతున్న ధర

గతేడాది క్వింటాల్ పసుపు పంటకు రూ.16వేల నుంచి రూ.17వేల వరకు ధర ఉంది. ఇది రైతులు ఆశించిన ధరే కావడంతో అప్పుడు గిట్టుబాటైంది. ప్రస్తుతం నిజామాబాద్‌లో క్వింటాల్ పసుపు పంటకు రూ.7వేల నుంచి రూ.10వేల వరకు మాత్రమే ధర ఉంది. దీంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు.

దిగుబడి బాగా తగ్గింది



ఈ ఏడాది నేను నాలుగెకరాల్లో పసుపు సాగు చేసిన. మొదట్లో పంటను తెగుళ్లు ఆశించాయి. దీంతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గింది. గతేడాది ధర ఉన్నా గిట్టుబాటయ్యేది. కానీ.. ప్రస్తుతం రూ.7వేలు మాత్రమే ఉండటంతో పెట్టుబడి ఖర్చులు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు.
– అశోక్, చింతల్‌చాంద

చాలా నష్టపోయిన



ఎన్నో ఆశలతో పసుపు సాగు చేసిన. ఎంత కష్టపడ్డా 15క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.7వేల నుంచి రూ.10 వేల ధర మాత్రమే ఉంది. ఎకరంలో పండించిన పంట అమ్మితే లక్ష రూపాయలు వచ్చినయ్. పసుపు సాగు చేసి చాలా నష్టపోయిన.
– భీమేశ్, తిర్పెల్లి

ప్రభుత్వం ధర పెంచాలె



పసుపు పంటకు సరైన గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నం. ప్రభుత్వం స్పందించి క్వింటాల్ పసుపు పంటకు కనీస ధర రూ. 16 వేల నుంచి రూ.18వేలు చెల్లించాలి. అప్పుడే పసుపు సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తారు. లేదంటే సాగు తగ్గే అవకాశముంది.
– గంగారెడ్డి, చామన్‌పెల్లి

'దేవాదాయ'ం.. గాల్లో దీపం!



జిల్లాకేంద్రంలోని గండిరామన్న ఆలయం

- గండిరామన్న గుడిలో పవర్ కట్
- చేసిన పనులకూ చెల్లింపుల్లేవ్
- అధికారుల పర్యవేక్షణ అంతంతే

నిర్మల్: 'ఆలయాల నుంచి వచ్చే ఆదాయాన్ని చూస్తున్నారే గానీ.. దేవుడి చుట్టూ ఉన్న సమస్యలు పరిష్కరించడం లేదు..' అంటూ దేవాదాయ శాఖపై బహిరంగంగానే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో పలు ఆలయాల్లో లోపాలను ఎత్తి చూపుతూ సోషల్ మీడియాలో నిత్యం పోస్టులు పెడుతున్నారు. నేరుగా ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారుల నుంచి పెద్దగా స్పందన రావడం లేదని భక్తులు వాపోతున్నారు. అభివృద్ధి పనులు, వసతుల కల్పన అటుంచి.. కనీసం కరెంట్, తాగునీరు, అర్చకులు, సిబ్బందికి సకాలంలో వేతనాల విషయం కూడా పట్టించుకోకపోవడంపై వెల్లువలా ఆరోపణలు వస్తున్నాయి.

గండిరామన్నకు కరెంట్ కట్

జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో ఒక్కటిగా వెలుగొందుతున్న నిర్మల్‌లోని గండిరామన్న దత్త సాయి ఆలయ ప్రాంగణంలో చీకట్లు ముసురుకున్నాయి. కొన్నినెలలుగా ఆలయం నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. దీంతో ఇటీవల కరెంట్ కట్ చేయడంతో అర్చకులు, సిబ్బంది నివాస గృహాల్లో అంధకారం నెలకొంది. ఊరికి శివారున, అటవీప్రాంతానికి సమీపంలో ఉండటంతో సంబంధిత కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ గడిపాయి. అధికారులు, పాలకవర్గం తీరుపై విమర్శలు రావడంతో విద్యుత్ అధికారులతో మాట్లాడి బిల్లులు చెల్లించకుండా, తాత్కాలికంగా కరెంట్ కనెక్షన్‌ను పునరుద్ధరింపజేశారు.

బిల్లులు ఇవ్వకపోవడంతో..

ఆలయాల్లో అభివృద్ధి పనులకు దాతలు ముందుకు వచ్చి డబ్బు, వస్తు రూపంలో సహకరించడం సాధారణమే. వారిచ్చిన వాటితో అక్కడ పాలకవర్గం, అధికారుల సమన్వయంతో పనులు చేయిస్తుంటారు. ఆ పనులు చేసిన వారికి బిల్లుల రూపంలో డబ్బులు చెల్లిస్తుంటారు. ఇది అంతటా జరిగేదే. కానీ.. గండిరామన్న ఆలయంలో చేసిన పనులకూ బిల్లులు ఇవ్వకపోవడంతో సంబంధిత వ్యక్తులు తాము చేసిన వస్తువులను తిరిగి తీసుకెళ్లడం గమనార్హం. సాయిబాబా ఆలయం పక్కన గల షెడ్డులో గల విగ్రహం వద్ద దాతల సహకారంతో స్టీల్ రెయిలింగ్‌తో పనులు చేయించారు. ఈ పనులు చేసినవారికి డబ్బులు ఇవ్వకపోవడంతో వారు వాటిని తిరిగి తీసుకెళ్లడం జిల్లాకేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. భక్తులు సోషల్ మీడియాలో ఈ విషయాన్ని వైరల్ చేయడంతో రెయిలింగ్ పనులు మళ్లీ చేయించారు.

ఇక్కట్లు దేవుడికెరుక

ఏ కష్టం వచ్చినా అందరూ 'దేవుడా.. నువ్వే దిక్కు..' అంటుంటారు. అలాంటి ఆలయాల్లో నిత్యం దైవసేవలో ఉండే అర్చకులు, సిబ్బంది సమస్యలు మాత్రం దేవాదాయశాఖ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఆలయాల్లో కాంట్రాక్ట్ సిబ్బంది, అర్చకులకు సకాలంలో వేతనాలు రావడం లేదు. అసలే అరకొరగా ఉన్న జీతాలు నెలలు గడిచినా రాక వారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఆలయాల్లో భక్తులు ఇచ్చే వస్తు కానుకలనూ అధికారులు వారికి దక్కనివ్వడం లేదన్న ఆరోపణలున్నాయి. ఆలయాల్లో చేసే అన్నదానాల్లోనూ అవకతవకలు చోటుచేసుకుంటున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. భక్తులకు అందించే భోజనానికి, పెట్టే బిల్లులకు పొంతన ఉండటం లేదన్న ఆరోపణలున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులూ రెగ్యులర్‌గా రావడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. వీటితో పాటు పలు ఆలయాలు శిథిలావస్థకు చేరుతున్నా కనీసం పట్టించుకునేవారు లేరని భక్తులు వాపోతున్నారు.

చర్యలు తీసుకోవాలి

జిల్లాకేంద్రంలోని పలు ఆలయాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. పాలకవర్గాలు, అధికారులున్నా భక్తులు, అర్చకులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. వీటిపై వెంటనే చర్యలు చేపట్టాలి.
– ఆకుల కార్తిక్, బీజేపీ పట్టణాధ్యక్షుడు, నిర్మల్

త్వరలోనే పరిష్కరిస్తాం

ఆలయాల్లో భక్తులకు సమస్యలు లేకుండా చూస్తున్నాం. గండిరామన్న ఆలయంలో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని త్వరలోనే పరిష్కరిస్తాం.
– రమేశ్, ఈవో, గండిరామన్న

ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసారూరల్: నిబంధనల మేరకే ఉపాధిహామీ పనులు చేపట్టాలని, కొలతల్లో తేడాలుంటే ఉపేక్షించబోమని డీఆర్డీవో విజయలక్ష్మి హెచ్చరించారు. బుధవారం భైంసా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ పనులపై 15వ బహిరంగ విచారణ చేపట్టారు. మండలంలోని 30 గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టిన పనులపై చర్చించారు. సామాజిక తనిఖీ బృందాలతో చేయించిన పనుల వివరాలు తెలుసుకున్నారు. కూలీలతో కలిసి సామాజిక తనిఖీ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఇంటింటికీ వెళ్లి కూలీలను కలిసి వివరాలు సేకరించారు. గ్రామాల వారీగా సేకరించిన వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభ నిర్వహించి వెల్లడించారు. గ్రామపంచాయతీల్లో నాటిన మొక్కలు చనిపోవడం, పని ప్రదేశాల్లో నేమ్‌బోర్డులు పెట్టకపోవడం, మస్టర్లలో కూలీల సంతకాలు లేకున్నా వేతనాలు చెల్లించడం లాంటి అంశాలను ప్రజావేదికలో డీఆర్పీలు వెల్లడించారు. 2023–24 సంవత్సరంలో రూ.7.50కోట్లతో చేపట్టిన పనుల్లో కొన్ని లోపాలను గుర్తించారు. పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు విధులను నిర్లక్ష్యం చేస్తూ రికార్డులను సరిగా నిర్వహించకపోవడాన్ని బయటపెట్టారు. విధుల్లో నిర్లక్ష్యం చేసిన సిబ్బంది నుంచి రూ.35వేలు రికవరీ, రూ.4వేల జరిమానా విధించారు. రానున్న రోజుల్లో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సమష్టిగా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, జేక్యూసీ కృపాకర్, ఎస్సార్పీ రాజు, ఎంపీడీవోలు సుధాకర్‌రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, ఏపీవో శివలింగం, ఈసీ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలున్నారు.

ఫీజు రాయితీ పొందాలి



మాట్లాడుతున్న కమిషనర్ రాజేశ్‌కుమార్

భైంసాటౌన్: ఈ నెలాఖరులోపు ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లించి 25శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో దరఖాస్తుదారులు, రియల్టర్లకు ఎల్‌ఆర్ఎస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఎల్‌ఆర్ఎస్ కోసం 6,288 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎల్‌ఆర్ఎస్ రూపంలో రూ.2కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం రావాల్సి ఉందని వెల్లడించారు. బుధవారం 30మంది ఎల్‌ఆర్ఎస్ ఫీజు చెల్లించగా, రూ.2.66 లక్షలు ఫీజు రూపంలో వచ్చినట్లు వివరించారు.

పుస్తక పరిచయం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

తానూరు: ముథోల్ మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రముఖ కవి జాదవ్ పుండలిక్‌రావ్ రచించిన 'తెలంగాణ ఉద్యమకారులు' పుస్తక పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముథోల్ ఎస్సై సంజయ్, భైంసా గురుకృప ఒకేషనల్ కళాశాల డైరెక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్, కవులు బసవరాజు, రెడ్ల బాలాజీ, పాత్రికేయులు శ్రీనివాస్, దిగాంబర్, అజయ్, చంద్రకాంత్, సాయిప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ చరిత్ర, ప్రజల పోరాటం, విద్యార్థులు, మేధావుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. ఎందరో వీరుల ప్రాణత్యాగాలు, ఆత్మబలిదానాల తర్వాత 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని వివరించారు. అనంతరం పుస్తక రచయిత పుండలిక్‌రావ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పోతన్నయాదవ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

భైంసాటౌన్: బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ జానకీ షర్మిల అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్‌కుమార్, రూరల్ సీఐ నైలు, ఎస్సై అశోక్, క్యాంప్ ఇన్‌చార్జి రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లను కాపాడుకోవాలి



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ కృష్ణంరాజు

నిర్మల్: కళ్లను కాపాడుకుంటేనే జీవితాన్ని చూడగలుగుతామని ప్రముఖ కంటివైద్యుడు కృష్ణంరాజు తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్ శిశుమందిర్‌లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. డాక్టర్ సతీశ్ చెవి, వినికిడి, మాట పరీక్షలు, డాక్టర్ ప్రవీణ్ జనరల్ చెకప్ చేసి మందులు అందించారు. విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువుపై దృష్టిపెట్టాలన్నారు. ఆహారంలో కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, కొవ్వు పదార్థాలను కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శిశుమందిర్ జిల్లా కార్యదర్శి షోలాపూర్ రాజేశ్వర్, శైక్షణిక్ ప్రముఖ్ కలిమహంతి వేణుమాధవ్, సాదు జనార్దన్‌రెడ్డి, పుష్పలత తదితరులున్నారు.

మీనం.. తోరణం



రత్నాపూర్‌కాండ్లీలో తాళ్లపై చేపలు ఆరబెడుతున్న మహిళ

దిలావర్‌పూర్ మండలం రత్నాపూర్‌కాండ్లీ, సముందర్‌పల్లి గ్రామాల మత్స్యకారులు చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. సమీప ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో చేపలు, రొయ్యలు పడుతూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. రోజువారీగా అమ్ముతూ మిగిలినవాటిని ఇలా తోరణాలు, మంచాలు, డాబా ఇళ్లపై ఆరబెట్టి ఆ తర్వాత విక్రయిస్తుంటారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



రొయ్యలు ఆరబెడుతున్న మత్స్యకారుడు



ఇంటిపై చేపలు ఆరబెడుతున్న మత్స్యకారుడు



సముందర్‌పల్లి గ్రామంలో తాళ్లపై ఆరబెట్టిన చేపలు

క్లుప్తంగా

లారీలను అడ్డుకున్న యువకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్‌: మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌ వెళ్తున్న లారీలను అక్రమంగా అడ్డగించి డ్రైవర్లను వేధింపులకు గురిచేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు జైనథ్‌ ఎస్సై పురుషోత్తం తెలిపారు. ఆదిలాబాద్‌ పట్టణానికి చెందిన పద్మవార్‌ రాకేష్‌, సచిన్‌, కార్తీక్‌, సాత్వీక్‌ మంగళవారం రాత్రి జైనథ్‌ మండలం భోరజ్‌ చెక్‌పోస్టు వద్ద లారీలు ఆపుతుండగా విషయం తెలుసుకున్న జైనథ్‌ పోలీసులు అక్కడికి వెళ్లారు. ఎలాంటి అధికారం లేకుండా ఎద్దుల లారీలను అక్రమంగా అడ్డుకుని డ్రైవర్లు సందీప్‌ గోకులే, షేక్‌ సాహిల్‌ను బెదిరిస్తుండడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

మద్యం పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను బుధవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్‌శాఖ ఇన్‌చార్జి సీఐ రమేశ్‌ తెలిపారు. వాంకిడి మండలంలోని గోయేగాం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని చంద్రపూర్‌ నుంచి గడ్చిరోలి జిల్లాలోని సిరోంచకు వెళ్తున్న బస్సును తనిఖీ చేయగా 90 ఎంఎల్‌ దేశీదారు బాటిళ్లు 1010, 2 లీటర్ల రాయల్‌స్టాగ్‌ బాటిళ్లు 11, 2 లీటర్ల ఐబీ బాటిల్‌ 1, ఆఫీసర్స్‌ చాయిస్‌ బాటిల్‌ 1 లభ్యమయ్యాయి. వాటి విలువ రూ.58,970 ఉంటుందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని తరలిస్తున్న తిరుమల బానయ్య, జ్యోతి దినేష్‌ కుంబారే, సుమలత, కిష్టయ్యపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో ఎక్సైజ్‌శాఖ హెడ్‌కానిస్టేబుల్‌ లక్ష్మణ్‌, కానిస్టేబుళ్లు ధన్‌రాజ్‌, రజిత పాల్గొన్నారు.

హెచ్‌ఎం అరెస్ట్‌

భీమిని: మండలంలోని జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రేగు చెట్టు రమేశ్‌ను బుధవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్‌ తెలిపారు. గత నెల 28న పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న బాలికతో అసభ్యంగా ప్రవర్తించినందుకు పోక్సో కేసు నమోదైంది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం అరెస్ట్‌ చేసి బెల్లంపల్లి కోర్టులో మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరు పర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలు



ఎల్లయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

కడెం: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ సమీపంలో బుధవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దస్తురాబాద్‌ మండలం మున్యాల్‌కు చెందిన ఇద్దరు యువకులు ఇంటర్‌ పరీక్షలు రాసేందుకు ద్విచక్ర వాహనంపై కడెం వస్తుండగా ఎస్‌బీఐ బ్యాంక్‌ వైపు నుంచి బైక్‌పై వస్తున్న ధర్మాజీపేట్‌ గ్రామానికి ఎల్లయ్య బైక్‌ను ఢీకొట్టారు. ఘటనలో ఎల్లయ్య కాలుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో ఖానాపూర్‌ ఆస్పత్రికి తరలించారు.

బావిలోపడి యువకుడు మృతి


కౌటాల: ప్రమాదవశాత్తు బావిలోపడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మొగడ్‌దగడ్‌కు చెందిన ఉర్వత్‌ దౌలత్‌ (26) కొంతకాలంగా మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని బావిలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుని తల్లి నిర్మలబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సహజ హోలీ.. సంతోషాల కేళి

- ఇప్పటికీ మోదుగుపూల రంగులే వాడుతున్న ఆదివాసీలు
- రసాయనాలతో ముప్పు

అడవులను నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఆదివాసీలు జరుపుకునే ప్రతీ పండుగకు ప్రత్యేక చరిత్ర ఉంటుంది. అందరిలా కాకుండా వారంతా ప్రత్యేకంగా వైవిధ్యంగా పండుగలు జరుపుకుంటారు. శుక్రవారం హోలీ పండుగను కూడా ప్రత్యేకంగా జరుపుకునేందుకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. హోలీ వేడుకల్లో ప్రత్యేకంగా మోదుగుపూలతో తయారు చేసిన రంగులతో రంగోలి ఆడడం ఆనవాయితీగా వస్తోంది. రేపు శుక్రవారం సంబరాలకు ఉమ్మడి జిల్లావాసులు సిద్ధమయ్యారు. వేడుకల్లో ఆరోగ్యానికి హాని కలిగించే రసాయన పూరిత రంగులు ఆరోగ్యానికి హానికరమని, సహజ సిద్ధమైన రంగులు వాడడం శ్రేయస్కరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

– కెరమెరి/నిర్మల్‌చైన్‌గేట్‌/నిర్మల్‌ఖిల్లా



పూలతో నిండుగా ఉన్న మోదుగు చెట్టు



పూలతో రంగులు తయారు చేస్తున్న ఆదివాసీలు

అనాదిగా వస్తున్న ఆచారం

ఆదివాసీలు ఆచార వ్యవహారాలకు పెద్దపీట వేస్తున్నారు. అనేక పండుగలను వైవిధ్యంగా జరుపుకుంటున్నప్పటికి ఈ హోలి పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. గతంలో బయట మార్కెట్లో ఎక్కడ కూడా అనుకున్న విధంగా రంగులు లభించేవి కాదు. అందుకు వీరంతా ప్రకృతి ప్రసాదించిన మోదుగు పూలనే రంగులకు వాడుకునేవారు. ఈ పూలు మార్చి నెలలో మాత్రమే ఉంటాయి.

రంగుల తయారీ ఇలా..

హోలీకి ఒక రోజు ముందు మోదుగ పూలను తీసుకువచ్చి నీటిలో నానబెడతారు. తెల్లవారు జామున రోట్లో వేసి రోకలితో దంచుతారు. లేదా గ్రైండింగ్‌ చేస్తారు. ఆతర్వాత నీటిలో కలిపి హోలీ ఆడుతారు.

సహజ రంగులైతే మేలు..

సహజ సిద్ధమైన రంగులు వాడితే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో వివిధ రకాలైన రంగులను తయారు చేసుకోవచ్చు. వీటితో ఎలాంటి హాని జరగదు. దానిమ్మ, టమాటతో ఎరుపు రంగు, మోదుగుపూలు, క్యారెట్‌తో ఆరెంజ్‌ రంగు, బీట్‌రూట్‌ ఊదారంగు, ఆకు కూరలతో ఆకుపచ్చ రంగు, పసుపు కొమ్ములతో పసుపు రంగు ఇలా సహజ సిద్ధమైన రంగులను తయారు చేసుకోవచ్చు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- చర్మానికి రంగులు పట్టుకోకుండా ముందస్తుగా ఆవాల నూనె, జెల్లీని రాసుకోవాలి.
- కళ్లకు అద్దాలు పెట్టుకుంటే రంగునీళ్లు కళ్లలో పడకుండా ఉంటాయి.
- హోలీ ఆడిన వెంటనే చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. లేదంటే చేతి గోర్ల నుంచి రంగులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది.

రసాయన రంగులతో ప్రమాదం..

- రంగుల్లో పాదరసం, సిలికా, మైకా, సీసం, వంటి వివిధ రకాల రసాయనాలు కలుపుతారు. ఇవి చర్మానికి, కళ్లకు, శ్వాస సంబంధిత సమస్యలకు కారణమవుతాయని వైద్యులు చెబుతున్నారు.
- రంగుల పొడి చల్లినప్పుడు అవి గాలిలో కలిసిపోయి నోటిలోకి, శ్వాసనాళాల్లోకి వెళ్లి ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. గాలి పీల్చినప్పుడు ఈ రంగులు ఊపిరితిత్తుల్లోకి వెళ్లి అస్తమా, ఎలర్జీ ఏర్పడే అవకాశం ఉంటుంది.
- రసాయన రంగులతో శరీరం దురద, మంట, నొప్పి కలుగుతుంది. కళ్లలో రంగులు పడితే కంటి పొరలు దెబ్బతినే అవకాశం ఉంది.
- రంగులు నోట్లోకి వెళ్తే వాంతులు, విరోచనాలు అవుతాయి. కడుపునొప్పి వస్తుంది.
- నలుపురంగులో లెడ్‌ ఆక్సైడ్‌తో మూత్రపిండాల వైఫల్యాలకు దారితీస్తుంది.
- కృత్రిమ ఆకుపచ్చ రంగుతో కాపర్‌ సల్ఫేట్‌ కంటి దురద, వాపు వైఫల్యాలకు దారితీస్తుంది.
- వెండి రంగు అల్యూమినియం బ్రోమైడ్‌ క్యాన్సర్‌ కారకం.
- నీలి రంగు చర్మ సంబంధ వ్యాధులు, మెర్క్యూరీ సల్ఫేట్‌ (ఎరుపు) క్యాన్సర్‌కు కారణమవుతుంది.
- పొడర్లు, గులాల్‌, లెడ్‌, బ్రోమియం, నికెల్‌, మెర్క్యూరీ, కాపర్‌, జింక్‌, వినికిడి లోపం, ఎలర్జీ, ఆయాసం మొదలగు దుష్ఫలితాలకు దారితీస్తాయి.

తాతమ్మ నేర్పిన మార్గంలోనే...



నిర్మల్‌ఖిల్లా: మోదుగ పూలు ఆరోగ్యరీత్యా పలు సుగుణాలు కలిగి ఉన్నాయి. నేను చిన్నప్పుడు దుకాణాల్లో కొనుగోలు చేసిన రంగులను వినియోగించే సందర్భంలో మా తాతమ్మ వాటికి బదులుగా మోదుగు పూలను తెచ్చి నానబెట్టి ఉడికించిన తర్వాత చేసిన కాషాయవర్ణపు సహజ సిద్ధ రంగులను వినియోగించమని ప్రోత్సహించేది. అలా నాకు దీని తయారీ అలవాటైంది. ఇప్పటికీ నా పిల్లలకు ఇదే సంప్రదాయాన్ని నేర్పిస్తూ కొనసాగిస్తున్నా.

– నల్ల మన్మోహన్‌రెడ్డి, సేంద్రియ రైతు, చించోలి(బి), నిర్మల్‌

మార్పుకోసం కృషి



రసాయన రంగులు మానుకోవాలి. ప్రకృతిలో దొరికే పూలు, ఆకులతో తయారయ్యే రంగులను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. తద్వారా పర్యావరణాన్ని కాపాడినట్టే. ఇదే విషయం మా పాఠశాల విద్యార్థులకు అర్థమయ్యేలా చెబుతున్నా. వారితో స్వయంగా సహజసిద్ధమైన రంగులు తయారు చేసే విధానం నేర్పిస్తున్నా.

– వీఎస్‌ శ్రీనివాస్‌, ఎంపీపీఎస్‌ వెంకటాపూర్‌, మామడ, నిర్మల్‌

రసాయన రంగులతో ముప్పు



రసాయన రంగులతో ఆరోగ్య సమస్యలు వస్తాయి. శరీరంలో మంట, దురద వస్తాయి. రంగుల నుంచి వచ్చే పొగ పీల్చుకోవడం ద్వారా ఊపిరితిత్తుల సమస్యలతో పాటు శ్వాస సంబంధిత వ్యాధుల ముప్పు ఉంటుంది.

– డాక్టర్‌ రత్నాకర్‌, ఫిజీషియన్‌, నిర్మల్‌

కృత్రిమ రసాయనాలతో ప్రమాదం



రంగులు ఏవైనా కళ్లల్లో పడకుండా జాగ్రత్త పడాలి. హానికర రసాయనాలతో కూడిన రంగులతో రెటినా దెబ్బతినే ప్రమాదం ఉంది. అల్సర్లు, పుండ్లు ఏర్పడి శాశ్వతంగా కంటి చూపు దెబ్బతినే అవకాశం ఉంది.

– సురేశ్‌, కంటి వైద్యనిపుణుడు, నిర్మల్‌

తాతాలకాలం నుంచి..



మోదుగ పూలతో రంగులు తయారు చేసుకుని చల్లుకోవడం తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఆచారం. ఇప్పటికీ మేము ఇదే ఆచారాన్ని పాటిస్తున్నాం. ఎన్ని రంగులు బయట నుంచి తీసుకవచ్చినా మోదుగు పూలతో తయారు చేసిన రంగులతో సరిపోవు.

– సెడ్మకి దుర్పతబాయి, మాజీ జెడ్పీటీసీ

పూర్వీకుల నుంచి..



ఉట్నూర్‌రూరల్‌/ఇంద్రవెల్లి: మా చిన్నతనం నుంచి హోలి పండుగ వచ్చిందంటే ప్రకృతి ప్రసాదించిన మోదుగ పూలతోనే రంగులు ఆడుతాం.. తెల్లవారు జామున నిద్రలేచి అడవికి వెళ్లి పూలు తెచ్చి రంగులు తయారు చేస్తాం. మా పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం.

– పెందూర్‌ చందు, సమాక, ఇంద్రవెల్లి

రాబోయే తరానికి..



ఉట్నూర్‌రూరల్‌/ఇంద్రవెల్లి: మార్కెట్లో లభించే రంగులు వాడితే అనేక రోగాలు వస్తాయని, అవి వాడవద్దని, అడవిలో లభించే మోదుగు పూలతో తయారు చేసిన రంగులనే వాడాలని మాపిల్లలకు నేర్పిస్తున్నాం. రాబోయే తరానికి కూడా నేర్పిస్తున్నాం.

– భీంరావు, సమాక, ఇంద్రవెల్లి

కుడుకలు ఇస్తే లెక్క

- నేడు పులారా.. రేపు దురాడి
- సంప్రదాయబద్ధంగా కాముడి దహనం
- డోలు, బాజాలతో తరలివెళ్లనున్న ఆదివాసీలు
- కామున్ని దహనం చేసిన చోటే రాత్రంతా బస

కెరమెరి/ఇంద్రవెల్లి: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయం ప్రకారం హోలీకి ముందురోజు గ్రామ పటేల్‌, దేవారికి గ్రామస్తులంతా కుడుకలు ఇస్తారు. ఇలా కుడుకలు ఇచ్చిన వారే గ్రామస్తులుగా పరిగణించబడుతారు. గ్రామంలో ఉండి కూడా కుడుకలు ఇవ్వని వారికి గ్రామంతో సంబంధం లేదని గుర్తిస్తారు. ఈ కార్యమంతా కాముని దహనం రోజు జరుగుతుంది. గురువారం సాయంత్రం జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో ఈ ఆచారం కొనసాగుతుంది. కుడుకలతో పాటు చక్కెర బిళ్లలు గ్రామ పటేల్‌, దేవారికి అందజేస్తారు. అనంతరం వాటిని లెక్కిస్తారు. వాటి ప్రకారం గ్రామంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, వాటికి సమానంగా కుడుకలు, పేర్లు వచ్చాయో లేదో పరిశీలిస్తారు.



కుడుకలు అందిస్తున్న గ్రామస్తులు (ఫైల్‌)

పులారా అలంకరణ

వెదురు కర్రలతో రెండు పులారాలను తయారు చేస్తారు. వాటికి ఐదుచోట్ల కుడుకలు, గారెలు, గోగుపూలు, చక్కెర బిళ్లలు, వంకాయ అమరుస్తారు. అనంతరం గ్రామ పొలిమేర వరకు డోలు, సన్నాయిలతో తరలివెళ్లి కాముని దహనం చేస్తారు. అనంతరం రెండు వెదుర్లకు వృద్ధుడు, వృద్ధురాలు అని నామం పెట్టి ఆ పులారాలను కడుతారు. కిందిభాగంలో మంట అంటిస్తారు. ఆ తర్వాత ఆ మంట పై నుంచి వరుసగా కొందరు దూకుతారు. అనంతరం గ్రామంలోని ప్రతీ కుటుంబం నుంచి రొట్టెలు, పప్పులు తీసుకువచ్చి కాముని దహనం వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. ఆతర్వాత సహపంక్తి భోజనం చేస్తారు. కాముడిని దహనం చేసిన చోటే రాత్రంతా బస చేస్తారు.

అన్ని పండుగలకు భిన్నంగా..



అన్ని పండుగలకంటే హోలి, దురాడి చాలా భిన్నంగా జరుపుకుంటాం. అంతా ఒక్కటై కాముని పున్నమిని జరుపుకుంటాం. కుడుకల ఆచారం చాలా ముఖ్యం. గ్రామ పటేల్‌కు కుడుకలు ఇస్తేనే ఆ గ్రామంలో ఉన్నట్టు. లేదంటే లేనట్టే. కాముని దహనం తర్వాత అక్కడే బస చేస్తాం.

– దంబీరావు, గ్రామ పటేల్‌, చిన్న సాకడ

తాత, ముత్తాతల నుంచి..



మాతాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారమిది. అన్ని గ్రామాల్లోని ఆదివాసీలు ఈ పండుగలకు అతీతులే. ప్రతిఒక్కరూ ఈ ఆచారాన్ని పాటించాల్సిందే. కానీ హోలి, దురాడి కార్యక్రమాల్లో మహిళలు అంతగా పాల్గొనరు. ఎక్కువగా ఈ కార్యక్రమాలను పురుషులు మాత్రమే జరుపుకుంటారు.

– రాధాబాయి, చౌపన్‌గూడ

కేరింతలకూ..చరిత్ర!

హోలీ రోజు ప్రతీ గ్రామంలో రంగులు చల్లుకుంటారు. కానీ ఆదివాసీ గిరిజనుల మాత్రం అందుకు కొంత భిన్నంగా ఉంటారు. రంగులు చల్లుకోవడంతో పాటుగా డోలు వాయిస్తూ.. జాజిరి ..జాజిరి.. బోబోబోబో.. అంటూ కేరింతలు పెడతారు. రావణాసురునిపై శ్రీరాముడు బాణం విసిరినప్పుడు అది తప్పిపోవడంతో రావణ సైన్యం అలాగే కేరింతలు పెట్టిందని, రావణుడు మరణించాక ఆ ఆనందంలో రాముని సైన్యం ఇలా తిరిగి కేరింతలు పెడుతూ ఉత్సాహంగా జరుపుకుంటారు. దానికి ప్రతీకగా ఈ కేరింతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పటేళ్లు చెబుతున్నారు.

బూడిదకు అత్యంత ప్రాధాన్యం

కాముడి దహనం తర్వాత అట్టి బూడిదను ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఇళ్ల ముఖద్వారాల వద్ద గీత వేస్తారు. అలా వేస్తే ఎలాంటి దుష్టశక్తులు తమ ఇళ్లకు రావని ఆదివాసీల నమ్మకం. అంతేకాకుండా దండారీ ఉత్సవాల్లో కాముడి బూడిదకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. గుస్సాడీ వేషధారణలో ఈ బూడిదను ఉపయోగిస్తారు.

ఇద్దరిపై వరకట్న వేధింపుల కేసు

మంచిర్యాలక్రైం: పట్టణంలోని హమాలివాడకు చెందిన ముత్యాల (చిలువేరు) స్వాతికి కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన ముత్యాల రాంప్రసాద్‌తో 2011 మార్చి 24న వివాహం జరిగింది. రాంప్రసాద్‌ విద్యుత్‌ శాఖలో ఏఈగా పనిచేస్తున్నాడు. వివాహ సమయంలో రూ.15 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు, సుమారు రెండు లక్షల విలువ గల సామగ్రి అందజేశారు. దంపతులకు పాప, బాబు జన్మించారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. గతంలో పోలీస్‌ స్టేషన్‌ వరకు రావడంతో కౌన్సిలింగ్‌ ఇచ్చి పంపించారు. అయినా రాంప్రసాద్‌, అతని సోదరి సరోజ అదనపు కట్నం కావాలని వేధించారు. అంతేకాకుండా రాంప్రసాద్‌ పలువురు మహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకుని స్వాతిని తీవ్రంగా కొట్టాడు. స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంప్రసాద్‌, సరోజపై అదనపు కట్నం, వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌ కుమార్‌ తెలిపారు.

కొలువుల సాధనలో మేటి అశోక్‌

- చదివిన కళాశాలలోనే జూనియర్‌ లెక్చరర్‌గా ఉద్యోగం

కాసిపేట: కష్టపడి చదివి నాలుగు ఉద్యోగాలు సాధించడంతో పాటు తాను విద్యను అభ్యసించిన ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలోనే జేఎల్‌గా ఉద్యోగం సాధించాడు జిల్లాకు చెందిన పెద్ది అశోక్‌. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని కొండపూర్‌కు చెందిన రిటైర్డ్‌ సింగరేణి కార్మికుడు పెద్ది పెంటయ్య, మధునమ్మ దంపతుల కుమారుడు అశోక్‌ 2012లో ఫారెస్టు బంగ్లా వాచర్‌ పరీక్షల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో మొదటి ర్యాంకుతో ఉద్యోగం సాధించాడు. కొలువు చేస్తూనే 2016లో ఫారెస్టు బీట్‌ ఆఫీసర్‌ ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో నాలుగో ర్యాంకు సాధించాడు. 2024లో జరిగిన గురుకుల డిగ్రీ లెక్చరర్‌ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించి నిర్మల్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల వెలువడిన ప్రభుత్వ జూనియర్‌ లెక్చరర్‌ పోస్టుల ఫలితాల్లో హిస్టరి సబ్జెక్టులో రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించి బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నాడు. తాను ఇంటర్‌ చదివిన కాసిపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో జేఎల్‌గా పోస్టింగ్‌ ఆర్డర్‌ తీసుకున్నాడు. 1 నుంచి పదోతరగతి వరకు ప్రైవేట్‌ పాఠశాలల్లో చదివిన అశోక్‌ ఇంటర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల కాసిపేటలో సీఈసీ, డిగ్రీ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మంచిర్యాలలో, పీజీ ఉస్మానియా యూనివర్సిటి ఆర్ట్స్‌ కాలేజీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. కాగా పీజీ ఎంట్రెన్స్‌లో సైతం మూడవ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తాను ఈ విజయం సాధించినట్లు పేర్కొన్నాడు. ఉద్యోగాల సాధనలో పట్టుదలతో ముందుకు వెళ్లడంతోనే విజయం సాధించినట్లు తెలిపాడు. భవిష్యత్‌లో గ్రూప్‌1 సాధించడం లక్ష్యంగా ముందుకెళ్తానని, అందుకు ప్రిపరేషన్‌ ప్రారంభించనున్నట్లు అశోక్‌ పేర్కొన్నాడు.



నియామకపత్రంతో అశోక్‌

డీసీపీ ఔదార్యం



గాయపడిన మహిళను ఆటోలో ఎక్కిస్తున్న డీసీపీ

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): హాజీపూర్‌ మండలం వేంపల్లిలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాద ఘటనలో డీసీపీ స్పందించిన తీరుపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్‌ లక్సెట్టిపేట నుంచి మంచిర్యాలకు వెళ్తుండగా వేంపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన డీసీపీ వెంటనే తన వాహనాన్ని ఆపి ఓ ఆటోలో మహిళను ఎక్కించి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. మానవతా దృక్పథం చాటిన డీసీపీని పలువురు అభినందిస్తున్నారు.

ఎన్‌సీడబ్ల్యూసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా రమేశ్‌



శెడంషెట్టి రమేశ్‌

భీమారం: నేషనల్‌ కాంగ్రెస్‌ వర్కర్స్‌ కమిటీ (ఎన్‌సీడబ్ల్యూసీ) ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని కాజిపల్లి గ్రామానికి చెందిన శెడంషెట్టి రమేశ్‌ను నియమిస్తూ బుధవారం కమిటీ ప్రెసిడెంట్‌ గుర్విందర్‌ మెహతా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌ పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా రమేశ్‌ తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్‌/మంచిర్యాలటౌన్‌: ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో డిగ్రీ పాసైన బీసీ అభ్యర్థులకు బ్యాంకింగ్‌ అండ్‌ ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్‌ సెంటర్‌ డైరెక్టర్‌ ప్రవీణ్‌ కుమార్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌ స్కూల్‌ ఆఫ్‌ బ్యాంకింగ్‌ అండ్‌ ఫైనాన్స్‌ ట్రైనింగ్‌ ఇనిస్టిట్యూట్‌ ద్వారా నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేట్‌ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్‌ కల్పిస్తారన్నారు. డిగ్రీ పూర్తిచేసి 26 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు ఈ నెల 15 నుంచి ఏప్రిల్‌ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్‌ 12న స్క్రీనింగ్‌ టెస్టు నిర్వహించి అందులో సాధించిన మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 08732-221280 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కలిసికట్టుగా ఆడితేనే విజయం

- హాకీ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

ఆదిలాబాద్‌: క్రీడాకారులు కలిసికట్టుగా పట్టుదలతో ఆడితేనే విజయం సాధ్యమని హాకీ అసోసియేషన్‌ ఆదిలాబాద్‌ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మేజర్‌ ధ్యాన్‌చంద్‌ హాకీ ఫీల్డ్‌లో ఏర్పాటు చేసిన హాకీ ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్‌ పురుషుల ఎంపిక పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికతో ఆడితే విజయం సులభం అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమలోని ప్రతిభను కనబరుస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. నిరంతరం సాధన చేస్తూ క్రీడా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 18 వరకు కరీంనగర్‌ జిల్లా హుజురాబాద్‌లో జరిగే 8వ రాష్ట్రస్థాయి సీనియర్‌ పురుషుల హాకీ టోర్నమెంట్లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వారికి మేనేజర్‌గా డేవిడ్‌ రాజు, శిక్షకునిగా జే.రవీందర్‌ వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా కోచ్‌ శ్రీనివాస్‌, సీనియర్‌ ప్లేయర్‌ అతుల్‌, పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

కొడప జంగు, వెట్టి జాకు, వెట్టి భీమ్‌రావ్‌, పవార్‌ అమర్నాథ్‌, విజయ్‌రెడ్డి, సుదర్శన్‌, హాడ్సే గజానంద్‌, చౌహాన్‌ వంశీ, మెస్రం అజయ్‌, శేఖర్‌, సంగం గౌతమ్‌, రామ్‌కుమార్‌, కిరణ్‌ కుమార్‌, పెద్దివార్‌ శ్రీనివాస్‌, అశోక్‌, షేక్‌ మహమ్మద్‌, కొడప ప్రదీప్‌, ఆత్రం జగ్జీవన్‌ ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ఒకరు అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్‌: గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై గౌతమ్‌ తెలిపారు. మావల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన వెంకట్‌ బుధవారం దస్నాపూర్‌ కాలనీ నుంచి పిట్టల్‌వాడకు స్కూటీపై గంజాయి తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు అతన్ని తనిఖీ చేయగా 176 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు పేర్కొన్నారు. గంజాయి విలువ రూ.4,400 ఉంటుందన్నారు. గంజాయితో పాటు స్కూటీ, సెల్‌ఫోన్‌ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.